క్లుప్తంగా

అంబేడ్కర్ స్ఫూర్తితో సేవ చేయాలి



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న శ్రీనివాస్

జగిత్యాలటౌన్: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పరితపించిన అంబేడ్కర్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ అణగారిన వర్గాలు, అనాథలకు సేవ చేయాలని రాజేశుని శ్రీనివాస్ కోరారు. ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (డిక్కీ) ఆధ్వర్యంలో జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి శ్రీనివాస్ ఆదివారం పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ స్ఫూర్తితో అనేక సేవ కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ స్మరణ కార్యక్రమ నిర్వాహకుడు, డిక్కీ అధ్యక్షుడు నల్ల శ్యాం, అనంతుల కాంతారావు, ప్రభాకర్, రమణ, జవ్వాజి శంకర్, అంబేడ్కర్ వాదులు పాల్గొన్నారు.

విద్యా వలంటీర్లను నియమించాలి

జగిత్యాల: ఇటీవల స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులతో ప్రాథమిక పాఠశాలలో చాలా ఎస్జీటీ పోస్టులు ఖాళీ అయ్యాయని, వెంటనే విద్యా వలంటీర్లను నియమించాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు ఆదివారం జిల్లా ఎస్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ శంకర్, భైరం హరికిరణ్ వినతిపత్రం అందించారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి పరిగణలోకి తీసుకోకుండా 50 మంది విద్యార్థులు దాటిన ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఒక హెచ్‌ఎం, ఐదుగురు సబ్జెక్టు టీచర్లను నియమించాలన్నారు, లేనిచో విద్యావలంటీర్లను నియమించాలని కోరారు.

ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న నరేశ్

కోరుట్లటౌన్: ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికలో కుల వివక్ష చూపారని రాష్ట్ర మంత్రి లక్ష్మణ్‌కుమార్‌కు బహుజనగళం వ్యవస్థాపక అధ్యక్షుడు లింగంపల్లి నరేశ్ ఆదివారం ఫిర్యాదు చేశారు. డీఎస్సీ 2000లో ఎంపికై 25 ఏళ్లుగా బోధనలో ఉండి, ఉద్యోగ, వ్యక్తిగత మంచి పేరు సంపాదించిన ఓ ఉపాధ్యాయుడి పేరు తొలగించడం అన్యాయమన్నారు. జిల్లా జాబితాకు నలుగురి పేర్లు పంపి, ఆ జాబితా నుంచి అన్ని అర్హతలు ఉన్న ఆ ఉపాధ్యాయుడి పేరు అవార్డు ఎంపికలో రాకపోవడంపై నరేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. అర్హతలు ఉన్న ఉపాధ్యాయుడు ఎస్సీ సామాజిక వర్గానికి చెందడమే శాపంగా మారిందని అభిప్రాయం వ్యక్తం చేశారు. కుల వివక్షను చూపిన సంబంధిత విద్యాధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని, పేరు తొలగించిన ఉపాధ్యాయుడికి న్యాయం జరగాలని మంత్రికి ఫిర్యాదు చేసినట్లు నరేశ్ తెలిపారు.

రిటైర్డ్ ఉద్యోగులకు ఉచిత వైద్యశిబిరం



పరీక్ష చేస్తున్న వైద్యులు

జగిత్యాల: కరీంనగర్ మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలని మెడ్ కవర్ నిర్వాహకులు గుర్రం కిరణ్ అన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిటైర్డు ఉద్యోగులు 300 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. బీజీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ లోకేష్, రాకేష్, వేణుగోపాల్, విష్ణుప్రియ తదితరులు పాల్గొన్నారు.

అసదుద్దీన్ ఓవైసీని కలిసిన కోరుట్ల నాయకులు

కోరుట్లటౌన్: పట్టణానికి చెందిన ఎంఐఎం పార్టీ నాయకులు హైదరాబాద్‌లో అసదుద్దీన్ ఓవైసీని కలిసి కోరుట్ల పట్టణ సమస్యలు పరిష్కరించేందుకు సహకరించాలని వినతిపత్రం అందించారు. కోరుట్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో వైద్యనిపుణులు, సిబ్బంది కొరత, ఈసీజీ, అల్ట్రా సౌండ్ స్కానింగ్ పరికరాలు లేవని, సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని కోరినట్లు ఎంఐఎం అధ్యక్షుడు ఎం.ఏ.రఫీ పేర్కొన్నారు.ఆయన వెంట నాయకులు అబ్దుల్ వాజిద్ అబ్దుల రహీం, మహమ్మద్ సల్మాన్ ఉన్నారు.

ఇసుకమేటలపై సర్వే పూర్తి

- భారీ వర్షాలకు పొలాల్లో ఇసుక మేటలు
- రైతులకు ఇబ్బంది
- ఉపాధిహామీలో తొలగించేందుకు నివేదికలు



రేచపల్లిలో ఇసుకమేటలు పెట్టిన రైతు పొలంలో రైతుతో అధికారులు

సారంగాపూర్: ఇటీవలి కురిసిన భారీ వర్షాలు, వరదలకు సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో రైతుల పంట పొలాల్లో ఇసుకమేటలు వేసి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సారంగాపూర్ మండలంలో అత్యధికంగా రేచపల్లి, సారంగాపూర్ గ్రామాల్లో ఎక్కువ ఇసుకమేటలు వేయగా, బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల్లో రైతుల పొలాల్లో ఇసుకమేటలు వేశాయి. దీంతో రైతులు సాగుచేసిన పంట ఇసుక కింద పడిపోగా, భూమి తన ఆనవాళ్లను కోల్పోయింది. అడవుల వెంట ఉన్న పొలాల్లో ఇసుకమేటల తీవ్రత ఎక్కువగా ఉంది. అడవుల నుంచి వచ్చే వరదలు, కాంటూర్ కందకాలు తెగిపోయి రైతుల పొలాల్లో భారీ ఎత్తున నీరు ప్రవహించి ఇసుక మేటలు ఏర్పడ్డాయి. దీనితో వ్యవసాయశాఖ అధికారులు పంట నష్టంతో పాటు, ఇసుక మేటలపై రైతువారీగా గత 10 రోజుల నుంచి సర్వే నిర్వహించారు. నష్టపోయిన పంటల వివరాలను, ఇసుక మేటల వివరాలను వేర్వేరుగా నమోదు చేశారు.

సీఎం ప్రకటనతో తయారైన నివేదికలు..

కామారెడ్డి పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి ఇసుకమేటలు వేసిన భూముల్లో వ్యవసాయ విస్తీర్ణాధికారులు రైతువారిగా వివరాలు సేకరించి డీఆర్‌డీవోకు సమర్పించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో వ్యవసాయశాఖ విస్తీర్ణాధికారులు రైతుల వారీగా ఇసుకమేటలపై సర్వే నిర్వహించి జిల్లా వ్యవసాయశాఖ అధికారులకు నివేదించారు. రైతు పొలంలో వ్యవసాయ విస్తీర్ణాధికారులు ఇసుక మేటలు ఏర్పడ్డ చోట ఫొటో దిగి జీపీఎస్‌తో ఫొటోను అనుసంధానం చేశారు.

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో 45 ఎకరాల్లో ఇసుకమేటలు:

సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని పొలాలు, ఇతర పంట భూముల్లో 45 ఎకరాల విస్తీర్ణంలో ఇసుక మేటలు వేసినట్లు రైతుల వారీగా పంటలను పరిశీలించి నివేదికలను జిల్లా అధికారులకు నివేదించారు . ఈ నివేదికను జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు పంపిస్తున్నారు.

ఉపాధిహామీ కూలీల ద్వారా ఇసుకమేటల తొలగింపు..

ముఖ్యమంత్రి చేసిన ప్రకటనతో వ్యవసాయశాఖ అధికారులు జిల్లా గ్రామీణ ఉపాధిహామీ శాఖకు (డీఆర్‌డీవో)నివేదికలు పంపించారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద కూలీలకు పని కల్పించడంతో పాటు, కూలీల ద్వారా ఇసుక మేటలను తొలగిస్తే రైతులకు రబీకి మరో పంట వేయడానికి భూమిని సిద్ధం చేసినట్లు అవుతుందని అధికారులు చెబుతున్నారు. కాగా ఒక రైతు ఇసుక మేటల తొలగింపునకు లబ్ధిపొందితే, పంట పరిహారం వర్తించదన్న నిబంధన విధించడంతో ఒక రైతుకు ఒకే విధమైన లాభం చేకూరుతుంది. ఇసుకమేటలు తొలగించడానికి రైతులకు బ్లేడ్ ట్రాక్టర్లు, జేసీబీలను వినియోగిస్తే రైతులపై పెను భారం పడుతుందని, ఉపాధిహామీ కూలీల ద్వార ఇసుకమేటలు తొలగింపు నిర్ణయం సరైందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ నిర్ణయం బాగుంది



ప్రభుత్వం ఇసుకమేటలను ఉపాధిహామీ కూలీల ద్వారా తొలగించాలని నిర్ణయించడం మంచి నిర్ణయం. ఇసుకమేటలు నష్టపోయిన రైతు భూమిలో ఇసుకపెట్టి నష్టపోయాడు, దానితో పంట కూడ దెబ్బతిన్నది. రెండు నష్టపోయిన రైతులకు పరిహారం కూడ అందించాలి. – తంగేళ్ల చంద్రమౌళి, రేచపల్లి

ఉపాధిహామీలో ఇసుకమేటలు తొలగింపు



ఉపాధిహామీ కూలీల ద్వారా ఇసుకమేటలను తొలిగించడానికి జిల్లా వ్యవసాయశాఖకు నివేదికలు అందించాం. అక్కడి నుండి డీఆర్‌డీవోకు నివేదికలు పంపించి, అనుమతులు మంజూరు రాగానే కూలీలతో ఇసుక మేటలను తొలగిస్తాం.

– ప్రదీప్‌రెడ్డి, సారంగాపూర్, బీర్‌పూర్ మండల వ్యవసాయాధికారి

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



సంపత్‌ను సన్మానిస్తున్న మంత్రి, కలెక్టర్

వెల్గటూర్ : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందడంతో తన బాధ్యత మరింత పెరిగిందని పాశిగామ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నీలం సంపత్ కుమార్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లో మంత్రి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి, కలెక్టర్ సత్యప్రసాద్ చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. హెచ్‌ఎంకు అవార్డు రావడం పట్ల పాశిగామ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ పీఈటీకి..

రాయికల్: జిల్లా ఉత్తమ పీఈటీ గా ఎంపికైన రాయికల్ పట్టణానికి చెందిన ఆడెపు సుజాతను ఆదివారం రాయికల్ పోపా ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో రాఘవులు, పోపా మండల అధ్యక్షులు దాసరి రామస్వామి, ప్రధాన కార్యదర్శి సిరిపురం మహేశ్, కోశాధికారి దాసరి కృష్ణహరి, సభ్యులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అవార్డు

కొడిమ్యాల: ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు రావడంతో సంతోషంగా ఉందని తిప్పాయపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.సత్యం అన్నారు.ఆదివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ , ఎమ్మెల్సీ అంజిరెడ్డి , జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో గౌరవించబడటం చాలా సంతోషమని, మా పాఠశాల, మా విద్యార్థుల కృషికి ప్రతిఫలమని తెలిపారు.

కథలాపూర్: మండలం లోని బొమ్మెన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం అంబటి రవి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కాగా.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆదివారం జగిత్యాలలో సన్మానించారు. ఆదివారం రాత్రి హెచ్‌ఎం అంబటి రవి స్వగ్రామం భూషణరావుపేటలో స్వాగతం పలికి ఆయనను నాయకులు, యువకులు సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, డీఈవో రాము పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో మంచి దిగుబడి



విద్యార్థులకు వివరిస్తున్న రైతు రామన్న

సారంగాపూర్: 13 ఏళ్లుగా సేంద్రియ వ్యవసాయం చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నానని సేంద్రియ రైతు మిట్టపల్లి రామన్న విద్యార్థులకు వివరించాడు. ఆదివారం బీర్‌పూర్ మండలం తుంగూర్ గ్రామానికి చెందిన ఆదర్శ రైతు రామన్న మహాత్మ జ్యోతిబాపూలే కరీంనగర్ వ్యవసాయ విద్యాలయం విద్యార్థులు తుంగూర్‌లోని రామన్న వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు తన అనుభవాలను పంచుకుంటూ పంచగవ్య, బీజామృతం, నీమాస్త్రం, అగ్నాస్త్రం, వర్మీ కంపోస్టు ఎరువులను ఎలా తయారు చేయవచ్చన్న విషయాన్ని విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ విద్యార్థులు శృతి, స్నేహలత, దీప్తీ, ప్రణీత, శ్రావణి, హరిణి పాల్గొన్నారు.

ముగిసిన వినాయక నిమజ్జనం



వినాయకుల నిమజ్జనం చేస్తున్న చిన్నారులు

మల్లాపూర్: మండల కేంద్రంలో ఆదివారం వినాయక నిమజ్జన వేడుకలు ముగిశాయి. వినాయకులకు ప్రత్యేక పూజలు చేయించి నిమజ్జన శోభాయాత్రను ప్రారంభించారు. మహిళలు మంగళ హారతులతో తరలిరాగ ఊరేగింపుగా వినాయకులను నిమజ్జనానికి తరలించారు. భక్తుల భజనపాటలు, డప్పు చప్పుళ్లు, బంగ్రా వాయిద్యాల మోతల్లో యువకుల నృత్యాలు, మహిళల కోలాటాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఎస్సై రాజు ఆధ్వర్యంలో కట్టుదిట్టమైన బందోబస్తు చేపట్టారు.

సామాజిక సేవతో గుర్తింపు



సొసైటీ నిర్వాహకులను సన్మానిస్తున్న విద్యాసాగర్ రావు

కోరుట్లటౌన్: సామాజిక సేవతో యువతకు గుర్తింపు వస్తుందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. కోరుట్ల సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో పట్టణంలో సామాజిక కార్యకర్తలను సన్మానించారు. సామాజిక సేవతో మానసిక తృప్తి కలుగుతుందన్నారు. కుల మతాలకు అతీతంగా సామాజిక సేవలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. రక్తదానం , అన్నదానం, ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడి ఆదుకోవడం సేవలు అందిస్తున్న యువత పని తీరు ప్రశంసనీయమని, ఈ స్ఫూర్తిని ఇలానే కొనసాగించాలన్నారు. సోషల్ సర్వీస్ సొసైటీ నిర్వాహకులు అమీర్‌ఖాన్, షాఖాన్, అన్వర్ సిద్దిఖీ, లక్ష్మీరాజం, శంకర్, మసూద్ అలీ, నాయకులు పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనంలో డీజే వాడకంపై కేసు నమోదు

జగిత్యాలక్రైం: పట్టణంలోని సాయిబాబా దేవాలయ సమీపంలో గోల్డెన్ యూత్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహం ఏర్పాటు చేశారు. శుక్రవారం నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అనుమతులు తీసుకోకుండా డీజే పెట్టడంతో పాటు, రోడ్డును బ్లాక్ చేసి ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు కలిగించారు. దీంతో, పట్టణ ఎస్సై కుమారస్వామి ఫిర్యాదు మేరకు మండపం ఆర్గనైజర్ మనోజ్, ఈవెంట్ మేనేజర్ శ్రావణ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై సుప్రియ తెలిపారు.

దిశ కమిటీ సభ్యుడికి సన్మానం

రాయికల్: మండలంలోని దావన్‌పెల్లి గ్రామానికి చెందిన బిక్కునాయక్ ఇటీవల దిశ కమిటీ సభ్యుడిగా నియమితుడు కాగా, ఆదివారం అల్యానాయక్‌లో ఆ గ్రామ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, రమేష్, హరీష్, గణేష్, గంగారెడ్డి, తిరుమల్, శ్రీకాంత్, గంగాధర్,రాం,నవీన్,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బరాజన్న ఆలయం మూసివేత

సారంగాపూర్: ప్రముఖ పుణ్యక్షేత్రం దుబ్బరాజన్న ఆలయాన్ని ఆదివారం చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం నుంచి ద్వారబంధనం చేశారు. బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయాన్ని కూడా ఆలయ అర్చకులు, సిబ్బంది మూసివేశారు. సోమవారం ఉదయం సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయం..

కొడిమ్యాల: మండలంలోని నల్లగొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఆదివారం అర్చకులు మూసివేసి తాళం వేశారు. మళ్లీ సోమవారం తెలవారుజామున ఆలయాన్ని తెరిచి భక్తులకు దర్శనం కల్పిస్తామని ఆలయ ఏవో వెంకన్న తెలిపారు.

గ్రామమంతా గాజుల పండగ



గాజులు పెట్టుకుంటున్న మహిళలు

మేడిపల్లి: భీమారం మండలం రాగోజీపేటలో తాజామాజీ సర్పంచ్ బాలసాని లహరిక, మారుతి ఆదివారం గాజులపండుగ నిర్వహించారు. గ్రామంలోని500మంది వృద్ధులు, యువతిలకు మెహందీ, పసుపు కుంకుమ అందించి గాజులు పంచి స్వీట్లు తినిపించారు. దాండియా, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు.

విద్యుత్‌శాఖ సేవలు భేష్

కోరుట్ల: కోరుట్లలో ఎటువంటి విద్యుత్ సమస్యలు జరగకుండా వినాయక నిమజ్జనం సంపూర్ణంగా జరిగింది. వినాయక చవితి మొదలైనప్పటి నుంచి ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఎక్కడికక్కడ సిబ్బంది విగ్రహాలు తరలింపులో జాగ్రత్తలు పాటిస్తూ, అవసరమైన మరమ్మతులు గుర్తించి సకాలంలో పూర్తి చేసి, విగ్రహాలు తరలింపు, మండపాల ఏర్పాట్లలో సేవలు అందించారు.కోరుట్ల పట్టణంలో నవరాత్రుల్లో సుమారు 160 మండపాలలో ఎక్కడా సమస్య రాకుండా ముందస్తు చర్యలు చేపట్టి, ప్రతీ నిర్వాహకుల వరకు విద్యుత్ భద్రతా సూచనలు, సలహాలు చేర వేశారు. గురువారం నుండి ప్రారంభం అయినటువంటి నిమజ్జనంలో తలమునకలయ్యారు. ఆదివారం వరకు సుమారు 72 గంటల పాటు నిరంతరాయ సేవలు అందించారు. వినాయక ఉత్సవాల్లో సేవలందించిన విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని ప్రజా ప్రతినిధులు, ఇతర శాఖ అధికారులు, శాఖ ఉన్నతాధికారులు వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు మెచ్చుకున్నారు.



పెగడపల్లి: మండలంలోని నామాపూర్‌లో గ్రామ పంచాయతీ భవన నిర్మాణం నిలిచిపోయింది. పాత భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణానికి గత ప్రభుత్వం ఈజీఎస్ నుంచి రూ. 20 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో స్లాబ్ వరకు పనులు చేసి బిల్లులు రాక కాంట్రాక్టర్ పనులు ఆపేశాడు. దీంతో రికార్డులు భద్రపరిచేందుకు. పనుల నిమిత్తం ప్రజలు వచ్చిన స్థలం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి నిధులు మంజూరు చేసి భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీవో, పెగడపల్లి , సెల్ నంబర్: 9281481659

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

మూసిన కల్వర్టు.. ఇళ్లలోకి మురికి నీరు



ఇళ్లలోకి చేరిన మురికి నీరు

రాయికల్: పట్టణంలోని ఒకటో వార్డులో భరత మాత విగ్రహం సమీపంలో ఉన్న కల్వర్టును మూసివేయడంతో ఇళ్లల్లోకి మురికి నీరు చేరడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దోమలు స్వైర విహారం చేయడంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్ ను వివరణ కోరగా కల్వర్టులో నుంచి మురికినీరు వెళ్లేలా చర్యలు చేపడతామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్వర్టు నుంచి మురికి నీరు తొలగింపజేసేలా చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

బతుకమ్మ కుంట పరిశీలన

సాక్షి స్పందన



బతుకమ్మ కుంటను పరిశీలిస్తున్న జీవన్‌రెడ్డి

సారంగాపూర్: బతుకమ్మకుంటకు మరమ్మతు చేయించాలని మాజీ మంత్రి జీవన్‌రెడ్డి ఆదివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కలిసి వివరించారు. సాక్షిలో 'కూలిపోతున్నా స్పందించరా' అని కథనం రావడంతో జీవన్‌రెడ్డి బతుకమ్మ కుంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వరదలు, విపత్తుల నిధుల నుంచి బతుకమ్మ కుంటకు తక్షణమే మరమ్మతులు చేయాలని కలెక్టర్‌కు, డీఎఫ్‌వోకు ఫోన్‌లో మాట్లాడారు. కుంట మరమ్మతు చేపడితే వన్యప్రాణుల తాగునీటితో పాటు, రైతుల బావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయనివివరించారు. అనంతరం జగిత్యాలలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ వెంటనే మరమ్మతులకు నిధులు మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

బీఆర్‌ఎస్ పాలనలోనే గ్రామాల అభివృద్ధి

పెగడపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాయని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నాయకులను గెలిపించుకోవాలని పెగడపల్లి మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు లోక మల్లారెడ్డి అన్నారు. మండలంలోని మ్యాకవెంకయ్యపల్లిలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మ్యాకవెంకయ్యపల్లిలో రూ. కోటి నిధులు వెచ్చించి పలు అభివృద్ధి పనులు చేశారని ప్రస్తుత ప్రభుత్వం ఇక్కడ చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీల అమలులో విఫలమైందని ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రజలకు వివరిస్తూ స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఇనుకొండ మోహన్‌రెడ్డి, చంద్రారెడి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు రాష్ట్ర స్థాయి పతకాలు

రాయికల్: పట్టణంలోని మాస్టర్ మానుక ప్రభాకర్, ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 19 మంది విద్యార్థులకు ఆదివారం కరీంనగర్ రెవెన్యూ భవనంలో జరిగిన మూడో రాష్ట్రస్థాయి ఓపెన్ ఆల్ స్టైల్స్ కుంగ్ ఫు, కరాటే ఛాంపియన్ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటి పతకాలు సాధించినట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను పలువురు అభినందించారు.